
ఆంధ్రజ్యోతి
గరిష్ఠం 35.0
కనిష్ఠం 23.8
ANDHRAJYOTHY
నల్లగొండ
5
ఆదివారం 23 జూన్ 2024

ప్రాజెక్టుల నీటిమట్టం

ప్రాజెక్టు	పూర్తిస్థాయి	ప్రస్తుతం	ఇన్‌ఫ్లో	అవుట్‌ఫ్లో
	నీటి మట్టం (అడుగులు)		(క్యూసెక్కులు)	
సాగర్ (టీఎంసీలు)	590 (312.5050)	504.40 (122.3596)	నిల్	800
మూసీ (టీఎంసీలు)	645 (4.46)	637.70 (2.71)	197	78.39
పులిచింతల (టీఎంసీలు)	175 (45.77)	94.29 (0.38)	50	50

చికెన్ ధరలు | లైవ్ : రూ.140 | డ్రెస్ : రూ.204 | స్కిన్‌లెస్ : రూ.234



నల్లగొండ టీటీఐ

దారిలో పెడుతున్న టీటీఐ

నిత్యం జిల్లాలో ఎక్కడో ఓ చోట రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకుని ఎంతో మంది యువకులు, వాహనదారులు గాయాల బారిన, మరికొందరు మృత్యువాతపడుతున్నారు. వారి కుటుంబాలు ఇంటి పెద్దను కోల్పోయి ఆర్థికంగా చితికిపోతున్నాయి. ఈ ప్రమాదాలను తగ్గించాలనే లక్ష్యంతో నల్లగొండ జిల్లా కేంద్రంలో టీటీఐ (ట్రాఫిక్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్)ను నాలుగేళ్ల కిత్రం ఏర్పాటు చేశారు. ఈ ఇనిస్టిట్యూట్ ద్వారా ఇప్పటి వరకు 25,160 మందికి కౌన్సిలింగ్ ఇచ్చారు. అంతేగాక రోడ్డు భద్రతా నియమాలపై 1,800 మంది విద్యార్థులకు అవగాహన కల్పించారు.

\- నల్లగొండ క్రైం

- ఇప్పటి వరకు 25,160 మందికి కౌన్సిలింగ్
- రోడ్డు ప్రమాదాల నివారణే లక్ష్యం
- డ్రంకెన్ డ్రైవ్ కేసుల్లో పట్టుబడిన వారికి ప్రత్యేకంగా కౌన్సిలింగ్

హైదరాబాద్ మినహా ఉమ్మడి ఏపీ రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా నల్లగొండ జిల్లా కేంద్రంలో టీటీఐ ఏర్పాటైంది. నాలుగేళ్ల క్రితం అప్పటి ఎస్పీ ఏవీ.రంగనాథ్ ఆలోచన విధానంతో ఇది రూపుదాల్చగా నాటి నుంచి ట్రాఫిక్ నిబంధనలపై వాహనదారులకు అవగాహన కల్పిస్తూ రోడ్డు ప్రమాదాల నివారణే లక్ష్యంగా పోలీస్‌శాఖ ముందుకు సాగుతోంది. జిల్లా కేంద్రంలోని పోలీస్ పరేడ్ గ్రౌండ్ పక్కనే అధునాతన ట్రాఫిక్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్ ఏర్పాటు చేశారు. రూ.25లక్షల వ్యయంతో దీన్ని తీర్చిదిద్దారు. మద్యం తాగి వాహనాలు నడిపిన వారికి, ట్రాఫిక్ నిబంధనలకు విరుద్ధంగా వాహనాలు నడిపిన వారికి ఇప్పటికే ఈ సెంటర్ ద్వారా కౌన్సిలింగ్ ఇస్తున్నారు. ఫలితంగా కొంత మేర డ్రంకెన్ డ్రైవ్‌తో పాటు ప్రమాదాలు కూడా తగ్గాయని పోలీసులు పేర్కొంటున్నారు.

నాలుగేళ్ల క్రితం ఏర్పాటు చేసిన ఈ సెంటర్ ద్వారా ఇప్పటి వరకు 25,160 మందికి కౌన్సిలింగ్ ఇచ్చారు. అదే విధంగా పలు పాఠశాలలు, కళాశాలకు చెందిన 1,800మంది విద్యార్థులకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు.

రూ.25లక్షల వ్యయంతో ఏర్పాటు

జిల్లా పోలీస్ కార్యాలయం సమీపంలో ట్రాఫిక్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్‌ను రూ.25లక్షల వ్యయంతో ఏర్పాటు చేశారు. మైనర్ డ్రైవింగ్, డ్రంకెన్ డ్రైవ్, లైసెన్స్, ఇతర కాగితాలు లేకుండా వాహనాలు నడిపే ఎలాంటి ఇబ్బందులు ఉంటాయి, కుటుంబాలు ఎలాంటి పరిస్థితులను ఎదుర్కొంటాయో వీడియో రూపంలో కౌన్సెలింగ్ ఇస్తారు. అందుకు ప్రత్యేకంగా పెద్ద సెమినార్ హాల్‌ను నిర్మించారు. కౌన్సిలింగ్‌కు మరో ప్రత్యేక హాల్ నిర్మించారు. మద్యం తాగి వాహనం నడిపితే జరిగిన ప్రమాదాలు, ఆ ప్రమాదాల్లో గాయపడి, మృతి చెందిన వారి కుటుంబాలు ప్రస్తుతం ఎలాంటి ఇబ్బందులను ఎదుర్కొంటున్నాయో కూడా వీడియోల రూపంలో వివరిస్తారు. వివిధ కేసుల్లో పోలీసులకు చిక్కిన వారి కుటుంబ సభ్యుల సమక్షంలో వాహనదారులను విచారించి జాగ్రత్త తీసుకునేలా కౌన్సిలింగ్ ఇస్తారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ట్రాఫిక్ సిగ్నల్స్ వద్ద పాటించే నియమాలను ప్రత్యక్షంగా చూపించేందుకు ట్రైనింగ్ సెంటర్ మైదానంలో సిగ్నల్స్ ఏర్పాటు చేసి వివరిస్తున్నారు. అదే విధంగా కళాశాల, పాఠశాల విద్యార్థులకు సైతం పోలీస్ అధికారుల ఆదేశాల మేరకు అవగాహన కల్పించి, గ్రామీణ ప్రాంతాలతో పాటు, పట్టణాల్లో ఇంటి చుట్టు పక్కల ఉండే వాహనదారులకు విద్యార్థుల ద్వారా కూడా అవగాహన కల్పిస్తున్నారు. స్పీడ్ బ్రేకర్లు, జీబ్రా క్రాసింగ్‌ల వద్ద వాహనాలు ఎలా నడపాలో చూపించేందుకు ప్రత్యేక ట్రాక్‌ను సైతం ఇక్కడ ఏర్పాటు చేశారు. సుమారు ఎకరం స్థలంలో ఏర్పాటు చేసిన ఈ సెంటర్‌లో గోడలపై ట్రాఫిక్ సిగ్నల్స్, రోడ్డు ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సంకేతాలను పెయింటింగ్ చేయించారు. సురక్షిత ప్రయాణం కోసం తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సంకేతాలు, వాహనం ఎలా నడపాలి, స్పీడ్ లిమిట్, హెల్మెట్ వాడకం, డ్రైవింగ్‌కు సంబంధించిన అన్ని అంశాలను అర్థమయ్యేలా అవగాహన కల్పిస్తున్నారు.



రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు



గతంకంటే ప్రస్తుతం రోడ్డు ప్రమాదాల సంఖ్య కొంత మేర తగ్గింది. జిల్లా పోలీస్‌శాఖ చేపట్టిన స్పెషల్ డ్రైవ్‌ల ద్వారా నిబంధనలు పాటించని, డ్రంకెన్ డ్రైవ్ కేసులపై ప్రత్యేక నిఘా ఉంచి వాహనదారులపై కేసులు నమోదు చేస్తున్నాం. అయినా అధిక వేగం, డ్రంకెన్ డ్రైవ్ ప్రమాదాలు చోటు చేసుకుంటుండడంతో వాటిని కూడా నివారించాలనే లక్ష్యంతో ట్రాఫిక్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్ ఏర్పాటైంది. హైదరాబాద్ తర్వాత ఈ సెంటర్ కేవలం నల్లగొండ పట్టణంలోనే ఉంది. వాహనదారులు జాగ్రత్తలు, నిబంధనలు పాటిస్తూ వాహనాలు నడుపుతూ సురక్షితంగా గమ్య స్థానాలకు చేరుకోవాలి.

\- శివరాంరెడ్డి, నల్లగొండ డీఎస్పీ

విద్యార్థులు, యువకులకు అవగాహన కల్పించేలా ఏర్పాట్లు



జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన ట్రాఫిక్ ట్రైనింగ్ సెంటర్ డ్రంకెన్ డ్రైవ్, మైనర్ డ్రైవింగ్‌తో పాటు సరైన పత్రాలు లేని వాహనదారులకు అవగాహన కల్పిస్తున్నాం. ఈ సెంటర్ ద్వారా కొంత మేర రోడ్డు ప్రమాదాలు తగ్గాయి. పట్టుబడిన వారికి వారి కుటుంబంలోని ఒకరి సమక్షంలో కౌన్సిలింగ్ నిర్వహిస్తున్నాం. డ్రైవింగ్‌కు సంబంధించి అన్ని అంశాలపై, మైనర్ డ్రైవింగ్‌పై విద్యార్థులకు, అధిక వేగంతో పాటు ఇతర అంశాలపై యువతకు అవగాహన కల్పిస్తున్నాం.

\- ఆనంద్‌కుమార్, నల్లగొండ ట్రాఫిక్ సీఐ

మిషన్ భగీరథ పనులు
ఆగమాగం

- చాలా గ్రామాలకు నీళ్లు అందని పరిస్థితి
- సొంత గ్రామాలకే నీళ్లు అందడం లేదని కోమటిరెడ్డి, గుత్తా వ్యాఖ్యలు
- జడ్పీ సర్వసభ్య చివరి సమావేశంలో పలు అంశాలపై చర్చ



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

నల్లగొండ, జూన్ 22: మిషన్ భగీరథ పథకం ద్వారా సొంత గ్రామాలకు సైతం నీరందడం లేదని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, శాసనమండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి వ్యాఖ్యలు, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారుల తీరుపై సభ్యుల మండిపాటు, విద్యుత్‌శాఖ పనితీరుపై సభ్యుల మధ్య వాగ్వివాదం నడుమ జిల్లా పరిషత్ సర్వసభ్య చివరి సమావేశంలో గరంగరంగా సాగింది. శనివారం జడ్పీ ఛైర్మన్ బండా నరేందర్‌రెడ్డి అధ్యక్షతన జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం జరిగింది. సమావేశంలో మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ, ప్రతీ ఇంటికి మిషన్ భగీరథ నీరు వచ్చేలా చూడాలని, అధికారులు గ్రామాల్లో తిరిగి సమస్యలను గుర్తించి వాటిని పరిష్కరించాలని, అవసరమైతే ఎమ్మెల్యేల నిధుల ద్వారా చిన్నచిన్న సమస్యలను అధిగమించాలని అన్నారు. ఆగస్టు 15లోగా రాష్ట్రంలో సుమారు రూ.31వేల కోట్ల రైతుల రుణమాఫీ చేసేందుకు రాష్ట్ర మంత్రివర్గం ఆమోదించిందన్నారు. సబ్ స్టేషన్లు, ట్రాన్స్‌ఫార్మర్లు ఇతర అవసరాల కోసం ఇదివరకే జిల్లాకు ఇప్పటికే రూ.11కోట్లు వచ్చాయని, మరో రూ.7కోట్లు వస్తామన్నారు. ఎక్కడైనా ట్రాన్స్‌ఫార్మర్, ఓవర్‌లోడ్ సమస్యలు తమ దృష్టికి తీసుకువస్తే వెంటనే వాటిని పరిష్కరిస్తామన్నారు. అదనపు బడ్జెట్‌ను ప్రతిపాదించాలని విద్యుత్ ఎస్ఈని ఆదేశించారు. భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకొని అవసరమైనచోట సబ్‌స్టేషన్ల ఏర్పాటుపై విద్యుత్ అధికారులు దృష్టి సారించాలన్నారు. జిల్లాలో సాగునీటి ప్రాజెక్టులన్నింటినీ పూర్తి చేయడమే తమ ధ్యేయమని, పంచాయతీ రోడ్లన్నింటినీ ఆర్అండ్‌బీ రహదారులుగా మార్చామన్నారు. పార్టీలకు అతీతంగా ప్రతీ ఒక్కరు పని చేయాలని పిలుపునిచ్చారు. వారం, 10 రోజుల్లో సీఎం రేవంత్‌రెడ్డి పర్యటనపై నిర్ణయం తీసుకోవడంతో పాటు తేదీ ఖరారు అవుతుందన్నారు. సీఎం పర్యటనలో దేవరకొండ నియోజకవర్గంలో ఎస్ఎల్‌బీసీతో పాటు నక్కలగండి, డిండి ఎత్తిపోతల ప్రాజెక్టు పనుల సమీక్ష ఉంటుందని తెలిపారు.

పెండింగ్ బిల్లులను చెల్లించాలి

శాసనమండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి మాట్లాడుతూ, మిషన్ భగీరథకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న బిల్లులు చెల్లింపులపై అధికారులు స్పష్టత ఇవ్వాలని అన్నారు. జిల్లాలో మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఉన్నందున పెండింగ్‌లో ఉన్న గొట్టిముక్కల, సింగరాజుపాలెం, పెండ్లిపాకల రిజర్వాయర్లు, పిల్లాయిపల్లి, ధర్మారెడ్డి కాల్వల పూర్తికి చొరవ చూపాలని కోరారు.

- నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం మాట్లాడుతూ, జిల్లాకు సరిపడా ఎరువులు, విత్తనాలు ఉన్నాయని, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు ముందే ప్రతిపాదనలు రూపొందించుకొని సమస్య లేకుండా చూసుకోవాలన్నారు.
- మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం రైతులకు 24గంటలు ఉచిత విద్యుత్ ఇస్తోందని, అంతేగాక రైతు రుణమాఫీ, రైతు భరోసాతో సహా ఇతర హామీలన్నింటినీ నెరవేర్చే దిశగా ముందుకెళ్తున్నట్లు తెలిపారు.
- తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేలు మాట్లాడుతూ, తన నియోజకవర్గం పరిధిలోకి వచ్చే శాలిగౌరారం తదితర మండలాల్లో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది పనితీరును మెరుగుపరుచుకోవాలని, పంచాయతీరాజ్ రోడ్లు కొన్ని చోట్ల కంకర తేలి ఉన్నాయని, వాటికి మరమ్మతు చేయాలన్నారు. జాతీయ రహదారి నుంచి ఇటుకలపాడు రోడ్డు పనులను వెంటనే ప్రారంభించాలని, శాలిగౌరారం చెరువు కట్టను పటిష్టం చేయాలన్నారు.
- దేవరకొండ ఎమ్మెల్యే బాలునాయక్ మాట్లాడుతూ, విద్యుత్ సమస్యలను అధిగమించేందుకు ప్రతీ నియోజకవర్గానికి రూ.2కోట్లు ఇప్పించేలా మంత్రి చొరవ చూపాలన్నారు. విద్యుత్ లైన్ల మార్పునకు చర్యలు తీసుకోవాలన్నారు.
- ఎమ్మెల్సీ నర్సిరెడ్డి మాట్లాడుతూ, లోవోల్టేజీ, విద్యుత్ సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. 'మన ఊరు-మనబడి'లో చేపట్టిన పనులు మధ్యలో నిలిచాయని, వాటిని పూర్తిచేయాలన్నారు. ప్రతీ పాఠశాలకు స్కావెంజర్లను నియమించాలని, విద్యుత్ బిల్లులు, శానిటేషన్‌కు స్కూల్ గ్రాంట్లు మంజూరు చేయాలని, కేజీబీవీలు సమర్థంగా పనిచేసేలా చర్యలు తీసుకోవాలన్నారు.
- జడ్పీటీసీ తిప్పన విజయసింహారెడ్డి మాట్లాడుతూ, మిర్యాలగూడలో ప్రతీ రోజు విద్యుత్‌కు అంతరాయం కలుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి స్పందించి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఇదే సమయంలో ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి మాట్లాడుతూ, విజయసింహారెడ్డి కావాలనే దీన్ని రాద్ధాంతం చేస్తున్నారని ఆరోపించారు. జూలై 4తో జిల్లా పరిషత్ పాలకవర్గం కాలపరిమితి ముగియనుండటంతో సమావేశానికి హాజరైన జడ్పీటీసీలు, ఎంపీపీలను మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, శాసనమండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి సన్మానించారు. సమావేశంలో భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్ రెడ్డి, కలెక్టర్ సి.నారాయణరెడ్డి, అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్, జడ్పీ సీఈవో ప్రేమ్‌కరణ్‌రెడ్డి, డిప్యూటీ సీఈవో శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

సమావేశానికి హాజరైన సభ్యులు


అంగన్‌వాడీకేంద్రాలను బలోపేతం చేసేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక దృష్టి సారించాయి. ఇప్పటి వరకు చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం అందిస్తున్న అంగన్‌వాడీ కేంద్రాల్లో 3 నుంచి ఆరేళ్లలోపు చిన్నారులకు ప్రీ ప్రైమరీ విద్యా బోధన చేపట్టనున్నారు. అందుకోసం అంగన్‌వాడీ టీచర్లకు ప్రత్యేక శిక్షణనిస్తున్నారు. పాఠశాలల విద్యార్థులకు అందించినట్టుగా అంగన్‌వాడీకేంద్రాల విద్యార్థులకూ యూనిఫామ్ అందించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు ఐసీడీఎస్ ప్రాజెక్టు కేంద్రాలకు క్లాత్ కూడా పంపించారు.

\- మోత్కూరు



అంగన్‌వాడీ విద్యార్థులకూ యూనిఫామ్



- ఈ ఏడాది నుంచే అమలు
- తొలుత ప్రాథమిక పాఠశాలల ఆవరణలో ఉన్న కేంద్రాల విద్యార్థులకు
- అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రీ ప్రైమరీ విద్య

అంగన్‌వాడీ కేంద్రాల్లో మూడు నుంచి ఆరేళ్లలోపు పిల్లలకు యూనిఫామ్ అందించాలని నిర్ణయించిన ప్రభుత్వం తొలుత ప్రాథమిక పాఠశాలల్లో నడుస్తున్న అంగన్‌వాడీ కేంద్రాల విద్యార్థులకు మాత్రమే యూనిఫామ్ అందించేందుకు ఏర్పాట్లు చేస్తోంది. ఈమేరకు జిల్లాలో నాలుగు ఐసీడీఎస్ ప్రాజెక్టులకు అవసరమైన క్లాత్ అందించారు. రెండో విడత మిగతా కేంద్రాల విద్యార్థులకు అందిస్తారంటున్నారు.

యూనిఫామ్ కుట్టే బాధ్యత మహిళా శక్తి సంఘాలకు..

అంగన్‌వాడీ విద్యార్థులకు యూనిఫామ్ కుట్టించి ఇచ్చే బాధ్యతను డీఆర్‌డీఏ ద్వారా మహిళా శక్తి సంఘాలకు అప్పగించారు. యూనిఫామ్‌కు సంబంధించిన డిజైన్‌లను కూడా ఎంపిక చేసినట్లు తెలిసింది. అబ్బాయిలకు నిక్కర్, షర్ట్, అమ్మాయిలకు ఫ్రాగ్ కుట్టాలని నిర్ణయించారంటున్నారు. ప్రస్తుతం మహిళా సంఘాల ద్వారా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల డ్రెస్‌లు కుడుతున్నారు. అవి పూర్తి కాగానే అంగన్‌వాడీ కేంద్రాల విద్యార్థుల డ్రెస్‌కుట్టే పని అప్పగించనున్నారు. దీంతో మహిళా సంఘాల సభ్యులకు కూడా ఆర్థిక (ఆదాయ) భరోసా కల్పించినట్లు అవుతుందని ప్రభుత్వం భావిస్తున్నది. జూలై మొదటి లేదా రెండో వారంలో అంగన్‌వాడీ విద్యార్థులకు యూనిఫామ్ అందించేందుకు అధికారులు కృషి చేస్తున్నారు.

యాదాద్రి జిల్లాలో 8,392 మంది విద్యార్థులకు లబ్ధి

యాదాద్రి జిల్లాలో మోత్కూరు, రామన్నపేట, ఆలేరు, భువనగిరి ఐసీడీఎస్ ప్రాజెక్టుల పరిధిలో 901 అంగన్‌వాడీ కేంద్రాలున్నాయి. వాటిల్లో 19,405 మంది చిన్నారులు నమోదయ్యారు. 414 అంగన్‌వాడీ కేంద్రాలు ప్రాథమిక పాఠశాలల ఆవరణల్లో ఉన్నాయి.

ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థులకు యూనిఫామ్ ఇస్తున్నందున వారితోపాటు అంగన్‌వాడీ కేంద్రాల విద్యార్థులకు కూడా తొలుత యూనిఫామ్ అందించనున్నారు. ఈ పథకంలో తొలి విడత 414 కేంద్రాల్లో 8,392 మంది విద్యార్థులు లబ్ధి పొందనున్నారు.

మానసిక ఒత్తిడి లేకుండా చదువు

ప్రైవేటు పాఠశాలల్లో నర్సరీ, ఎల్‌కేజీ, యూకేజీ విద్యను అందించినట్లుగానే అంగన్‌వాడీకేంద్రాల్లో 3 నుంచి ఆరేళ్లలోపు పిల్లలకు ప్రీస్కూల్ విద్యనందిస్తున్నారు. పిల్లలపై ఎలాంటి మానసిక ఒత్తిడి కలుగకుండా నిపుణుల సూచనల మేరకు ఆట, పాటలు, కథల ద్వారా చిన్నారులకు చదువుపై ఆసక్తి పెంపొందించనున్నారు. ఇందుకు అంగన్‌వాడీ టీచర్లకు శిక్షణనిస్తున్నారు.

చిన్నారుల్లో చదువుపై ఆసక్తి పెంచేందుకు

అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే పిల్లలకు పౌష్టికాహారంతో పాటు ప్రీస్కూల్ విద్యనందించేందుకు ప్రభుత్వం కొత్త ప్రణాళికలు రూపొందించింది. మూడు నుంచి ఆరేళ్లలోపు విద్యార్థులకు యూనిఫామ్ అందించనున్నాం. వారికి ప్రైవేటు పాఠశాలలు అందిస్తున్న నర్సరీ, ఎల్‌కేజీ, యూకేజీ విద్యకు దీటుగా ప్రీ స్కూల్ విద్యనందిస్తాం. ఇందుకు అంగన్‌వాడీ టీచర్లకు దశలవారీగా శిక్షణనిస్తున్నాం. యూనిఫామ్ కుట్టించే బాధ్యతను సెర్ప్‌కు అప్పగించాం.

\- కృష్ణవేణి, ఐసీడీఎస్ యాదాద్రి జిల్లా ప్రాజెక్టు అధికారి

రేపటి ప్రజావాణి రద్దు
మండల స్థాయిలో నిర్వహణ

నల్లగొండ టౌన్, జూన్ 22: కలెక్టర్ సహా అదనపు కలెక్టర్లు, జిల్లా స్థాయి అధికారులు మండల స్థాయిలో నిర్వహించే 'ప్రజావాణి' కార్యక్రమానికి హాజరవుతున్న నేపథ్యంలో జిల్లా కేంద్రంలో ఈ నెల 24న నిర్వహించే 'ప్రజావాణి' కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు కలెక్టర్ సీ.నారాయణరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం నుంచి మండల స్థాయిలో కూడా జిల్లా స్థాయి తరహాలో 'ప్రజావాణి' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకుని ఫిర్యాదుదారులు జిల్లా కేంద్రానికి రాకుండా మండల కేంద్రాలకు వెళ్లి ఫిర్యాదులు అందజేయాలని కోరారు. సోమవారం నుంచి జిల్లాలోని 33 మండలాలతో పాటు, నల్లగొండ, దేవరకొండ, మిర్యాలగూడ మునిసిపాలిటీ కార్యాలయాల్లో సైతం 'ప్రజావాణి' నిర్వహించనున్నట్టు తెలిపారు. ఉదయం 10.30 గంటలకు మండల కేంద్రాల్లో ప్రజావాణి కార్యక్రమం ప్రారంభమవుతుందని, మధ్యాహ్నం 2 గంటలకు ముగుస్తుందన్నారు. మండల స్థాయిలో నిర్వహించే ప్రజావాణికి ఎంపీడీవో అధ్యక్షతన వహిస్తారని, మండల ప్రత్యేక అధికారి, తహసీల్దార్, ఎంఈవో, వ్యవసాయాధికారి, ఏపీఎంతో తోపాటు, ఇతర శాఖల అధికారులు మండల ప్రజావాణిలో పాల్గొంటారని తెలిపారు. ఫిర్యాదుదారుల కు రశీదులు కూడా ఇస్తారన్నారు. ప్రతీ ఫిర్యాదుకు ఒక ఐడీ నెంబర్‌ను కేటాయించనున్నట్టు తెలిపారు. మండల స్థాయిలో పరిష్కారం కానీ ఫిర్యాదులను 15రోజుల తర్వాత జిల్లా స్థాయి 'ప్రజావాణి'లో సమర్పించవచ్చని తెలిపారు. జిల్లా స్థాయిలో తిరిగి ప్రజావాణి కార్యక్రమం ఎప్పుడు నిర్వహించేది తెలియజేస్తామని పేర్కొన్నారు.

బైపాస్ మూడో ప్రతిపాదనను ఉపసంహరించుకోవాలి


బీజేపీ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి


ధర్నాలో మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి

నల్లగొండ, జూన్ 22: బైపాస్ రోడ్డు నిర్మాణంలో భాగంగా మూడో ప్రతిపాదనను ఉపసంహరించుకోవాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి డిమాండ్ చేశారు. శనివారం స్థానిక క్లాక్‌టవర్ సెంటర్‌లో బాధితులతో కలిసి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నకిరేకల్-నాగార్జునసాగర్ జాతీయ రహదారికి నల్లగొండ పట్టణం బయటి నుంచి బైపాస్ రోడ్డు ప్రతిపాదన ఒకటి, రెండును కాదని మూడో ప్రతిపాదనను ఎంచుకోవడంలో ఆంతర్యం ఏమిటని ప్రశ్నించారు. మూడో ప్రతిపాదనతో సమారు మూడు వేల మంది మధ్యతరగతి ప్రజలు ఇళ్లు, ఇళ్ల స్థలాలను కోల్పోయే అవకాశం ఉందన్నారు. బాధితులు మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిని కలిసేందుకు వెళ్లినా, పట్టించుకోకుండా పక్కకు తప్పించి వెళ్లిపోయారని ఎద్దేవా చేశారు. ఓట్లు వేసి గెలిపించిన నలగొండ ప్రజలను ఇలా అవమానిస్తారా అని ప్రశ్నించారు. బాధితులకు న్యాయం జరిగే వరకు పోరాటం చేస్తూనే ఉంటామని, అవసరమైతే మంత్రి ఇంటిని కూడా ముట్టడిస్తామని హెచ్చరించారు. దీనిపై కలెక్టర్ స్పందించి చర్యలు తీసుకోవాలని కోరారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శి మాదగోని శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ, అభివృద్ధి అనేది ప్రజలకు ఉపయోగపడేలా ఉండాలి తప్ప నాయకుల స్వలాభం కోసం ఉండకూడదన్నారు. ఏళ్లుగా డబ్బును పొదుపు చేసిన మధ్యతరగతి, పేదలు కొనుగోలు చేసిన ఇళ్ల స్థలాలు కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అభివృద్ధి పేరుతో అరాచకాలు చేస్తున్నారని, ఇకనైనా వాటిని మానుకోవాలని హితవు పలికారు. బైపాస్ మూడో ప్రతిపాదనను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కిసాన్ మోర్చ జాతీయ నాయకుడు గోలి మధుసూదన్‌రెడ్డి, పార్లమెంట్ కన్వీనర్ బండారు ప్రసాద్, పార్లమెంట్ కోకన్వీనర్ పిల్లి రామరాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి చెనమోని రాములు, పోతేపాక లింగస్వామి, ఫకీరు మోహన్‌రెడ్డి, పెరిక మునికుమార్, మిర్యాల వెంకటేశం, దాయం భూపాల్‌రెడ్డి, కంకణాల నాగిరెడ్డి, బొగరి అనిల్‌కుమార్, పల్లె ప్రకాష్, కౌన్సిలర్లు బొజ్జ నాగరాజు, గుర్రం ధనలక్ష్మి వెంకటేశ్వర్లు, పిట్టల శ్రీనివాస్, రాఖీ, రేవల్లి కిరణ్‌పాల్గొన్నారు.

డీసీఎంఎస్ చైర్మన్‌గా
బోళ్ల వెంకట్‌రెడ్డి ఏకగ్రీవ ఎన్నిక

•7లో..









ఉద్యోగ దరఖాస్తుకు తరలివచ్చిన నిరుద్యోగులు


భువనగిరి అర్బన్, జూన్ 22: యాదాద్రిభువనగిరి జిల్లాకేంద్రంలోని వైద్య కళాశాలలో ఖాళీల భర్తీకి వైద్య శాఖ ఇటీవల నోటిఫికేషన్ విడుదల చేసింది. దరఖాస్తులకు గడువు చివరిరోజు కావడంతో తరలి వచ్చిన నిరుద్యోగులతో శనివారం కలెక్టరేట్ ప్రాంగణంలో ద్విచక్ర వాహనాలతో పూర్తిగా నిండిపోయింది. అదేవిధంగా ఉపాధి కల్పన కార్యాలయం వద్ద పెద్దఎత్తున నిరుద్యోగులు గుమిగూడారు. ఈ నెల 16న జిల్లాలో ప్రభుత్వ వైద్య కళాశాలలో వివిధ విభాగాల్లో ఖాళీలకు పొరుగు సేవల పద్ధతిలో దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు టీం మెంబర్ సెక్రటరీ బీ శాంతిశ్రీ తెలిపారు. దరఖాస్తులు ఈ నెల 18 నుంచి 22వరకు సాయంత్రం 5గంటల లోగా ఉపాధి కల్పన అధికారి కార్యాలయంలో అందజేయాలని ప్రకటన విడుదల చేశారు. ప్రభుత్వ డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ ఆదేశాల మేరకు చివరి రోజు కావడంతో కలెక్టరేట్‌కు భారీగా చేరి దరఖాస్తులు చేరుకున్నారు. కాగా, ఖాళీలకు గాను మెరిట్,



నిరుద్యోగులతో కిక్కిరిసిన ఉపాధి కల్పన కార్యాలయం

ఖాళీలు	పోస్టులు	దరఖాస్తులు
10	డేటా ఎంట్రీ ఆపరేటర్లు	482
4	డిసెక్షన్ హాల్ అటెండెంట్లు	09
4	ల్యాబ్ అటెండెంట్లు	116
8	సబార్డినేట్ స్టాఫ్	515
2	రికార్డు అసిస్టెంట్	02
4	థియేటర్ అసిస్టెంట్	63
32		1,187

అర్హతల ఆధారంగా అభ్యర్థులు 18 నుంచి 44 ఏళ్ల పరిమితి కలిగి విద్యార్హతకు సంబంధించిన ధ్రువపత్రాలు, కుల, నివాస ధ్రువపత్రాలతో పాటు ఆధార్ కార్డు, నాలుగవ తరగతి నుంచి పదవ తరగతి వరకు బోనాఫైడ్ సర్టిఫికెట్లు జతపర్చి అందజేయాలని, గతంలో ప్రజావాణీ, టీం కార్యాలయంలో దరఖాస్తులు చేసుకున్నవారు కూడా తిరిగి దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు.



గడ్డపారతో అన్నపై దాడి

చిలుకూరు, జూన్ 22 : భూతగాదాల నేపథ్యంలో సూర్యాపేట జిల్లా చిలుకూరు మండలం నారాయణపురంలో అన్నపై గడ్డపారతో తమ్ముడు దాడి చేశాడు. ఈ ఘటన శనివారం ఆలస్యంగా వెలుగులోకివచ్చింది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన పందిర ధనమూర్తి తన పొలం సాగు చేస్తుండగా, అతడి తమ్ముడు వీరబాబు వచ్చి భూముల కొలతల్లో తేడాలున్నాయంటూ ధనమూర్తితో ఘర్షణకు దిగాడు. ఈ ఘర్షణలో అందుబాటులో ఉన్న గడ్డపారతో తలపై కొట్టాడు. దీంతో ధనమూర్తి తలకు తీవ్రగాయాలయ్యాయి. ఈ విషయమై బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ సురభి రాంబాబుగౌడ్ తెలిపారు. ధనమూర్తి ప్రస్తుతం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు.

వృద్ధురాలి అదృశ్యం

గుర్రంపోడు, జూన్ 22 : వృద్ధురాలి అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు నల్లగొండ జిల్లా గుర్రంపోడు స్టేషన్‌లో కేసు నమోదైంది. తేరాటిగూడెం గ్రామానికి చెందిన గున్‌రెడ్డి వెంకటనర్సమ్మ(62) ఈ నెల 20న వృద్ధాప్య పింఛన్ తీసుకునేందుకు సమీపంలోని చేపూరు గ్రామ పోస్టాఫీస్‌కు వెళ్లి తిరిగిరాలేదు. దీంతో రెండు రోజులుగా వెతకుతున్నప్పటికీ ఆచూకీ లభ్యం కాలేదని కుమారుడు కున్‌రెడ్డి రఘువర్ధన్‌రెడ్డి శనివారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదుచేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.









నేడు సూర్యాపేటలో వివేక్ స్మారక ఉపన్యాసం

హాజరుకానున్న 'ఆంధ్రజ్యోతి' ఎడిటర్ కె.శ్రీనివాస్

నల్లగొండ, జూన్ 22: సమ సమాజ స్వాప్నికుడు వివేక్ స్మారక ఉపన్యాసం ఆదివారం సూర్యాపేటలో నిర్వహిస్తున్నట్లు ఆయన తల్లిదండ్రులు యోగానంద్, మాధవి శనివారం తెలిపారు. ఛత్తీస్‌ఘడ్‌లో 2015లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో మృతిచెందిన ముగ్గురు మావోయిస్టుల్లో వివేక్ ఒకరు. సూర్యాపేట జిల్లా కేంద్రానికి చెందిన అతడు ఉస్మానియా యూనివర్సిటీలో ఎల్ఎల్‌బీ చదువుతూ కమ్యూనిజం భావజాలానికి ఆకర్షితుడై మావోయిస్టుల్లో చేరాడు. అతడి తల్లిదండ్రులు ఇద్దరూ ప్రభుత్వ ఉపాధ్యాయులే. కాగా, అతడి 9వ వర్ధంతి సందర్భంగా ఆదివారం సూర్యాపేట కలెక్టరేట్ రోడ్డులోని ఆర్ఆర్ఆర్ ఫంక్షన్‌హాల్‌లో ఉదయం 10గంటలకు సభ నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా స్మారక ఉపన్యాస కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. '2024 ఎన్నికలు - ఒక అవగాహన' అనే అంశంపై 'ఆంధ్రజ్యోతి' సంపాదకుడు కె.శ్రీనివాస్ ప్రసంగించనున్నారు. మధ్యాహ్నం 'భారతదేశం ప్రజాస్వామ్యం' అనే అంశంపై విరసం బాధ్యుడు సీఎస్ఆర్.ప్రసాద్ మాట్లాడనున్నారు. ఈ కార్యక్రమానికి ప్రజాస్వామిక వాదులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని యోగానంద్, మాధవి కోరారు.

నిబంధనలను ఉల్లంఘిస్తే చర్యలు : సీఐ

చింతపల్లి, జూన్ 22 : వాహనదారులు నిబంధనలు పాటించాలని, ఉల్లంఘిస్తే చర్యలు తీసుకుంటామని నల్లగొండ జిల్లా నాంపల్లి సీఐ నవీన్‌కుమార్ అన్నారు. శనివారం చింతపల్లి-మాల్ రాష్ట్ర రహదారిపై పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. ప్రతీ వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీచేశారు. నెంబర్లు లేని 11 ద్విచక్రవాహనాలను సీజ్ చేసినట్లు తెలిపారు. వాహనదారులు అతివేగంగా, అజాగ్రత్తగా వాహనాలు నడపవద్దని సూచించారు. తనిఖీల్లో ఎస్ఐ యాదయ్య, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

జాతీయ స్థాయి ఇన్‌స్పైయిర్ పోటీలకు మూడు ప్రాజెక్టులు

- యాదాద్రిభువనగిరి జిల్లా నుంచి ఎంపిక
- రెండు ప్రభుత్వ, ఒకటి ప్రైవేట్ పాఠశాల విద్యార్థులు రూపకల్పన

భువనగిరి టౌన్, జూన్ 22 : జాతీయస్థాయి ఇన్‌స్పైయిర్ పోటీలకు యాదాద్రిభువనగిరి జిల్లా నుంచి మూడు ప్రాజెక్టులు అర్హత సాధించాయి. 2022-23 విద్యాసంవత్సరానికి జిల్లా నుంచి 13 ప్రాజెక్టులు ఈ నెల 14, 15 తేదీల్లో రాష్ట్ర స్థాయి ప్రదర్శనలకు ఆన్‌లైన్‌లో పోటీపడ్డాయి.వీడియోలు, ఫొటోలు, ప్రాజెక్ట్ వివరాలను ఇన్‌స్పైయిర్ యాప్‌లో అప్‌లోడ్ చేసే విధానంలో జరిగిన పోటీల్లో జిల్లా నుంచి మూడు ప్రాజెక్టులు 2024 జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యాయి. ఈ మేరకు ఎన్‌సీఈఆర్‌టీ డైరెక్టర్ గాజర్ల రమేష్, జిల్లా సైన్స్ అధికారి భరణి శనివారం తెలిపారు. అయితే రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి 259 మంది విద్యార్థులు తాము రూపొందించిన ప్రాజెక్టులతో జాతీయ ఎంపిక పోటీల్లో నిలవగా, అందులో 26ప్రాజెక్టులు అర్హత సాధించాయి. వాటిలో మూడు ప్రాజెక్టులు యాదాద్రి భువనగిరి జిల్లావే కావడం విశేషం. జాతీయస్థాయి పోటీలకు ఎంపికైన ముగ్గురిలో ఇద్దరు ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు కాగా మరొకరు ప్రైవేట్ పాఠశాల విద్యార్థి.

సృజనాత్మకతను వెలికి తీసేలా..

విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీసేలా ప్రతీ ఏడాది ఇన్‌స్పైయిర్ పోటీలను నిర్వహిస్తున్నారు. జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిల్లో నేషనల్ కౌన్సిల్ ఆఫ్ రీసెర్చ్ అండ్ ట్రైనింగ్(ఎన్‌సీఈఆర్‌టీ) ఆధ్వర్యంలో ఆన్‌లైన్‌లో ఇన్‌స్పైయిర్ పోటీలను నిర్వహిస్తుంటారు. జాతీయ స్థాయిలో పతకాలు సాధించిన ప్రాజెక్టులను రూపొందించిన విద్యార్థులకు పేటెంట్ హక్కులు కూడా లభించే అవకాశాలు ఉంటాయి. సైన్స్ పట్ల ఆసక్తి పెంచుతూ నూతన పరిశోధనలను ప్రోత్సహించి భావి శాస్త్రవేత్తలను తీర్చిదిద్దడమే ఈ పోటీల లక్ష్యం. గత విద్యా సంవత్సరంలో జిల్లా స్థాయి పోటీలు జరగ్గా రాష్ట్ర స్థాయి పోటీలు జూన్ 14, 15లో నిర్వహించారు. ఇక జాతీయ స్థాయి పోటీలు ఆగస్టు, సెప్టెంబరులో జరగనున్నాయి.

విద్యార్థుల ప్రతిభ అభినందనీయం



జాతీయ స్థాయి ఇన్‌స్పైయిర్ పోటీలకు జిల్లా నుంచి 3 ప్రాజెక్టులు అర్హత సాధించడం విద్యార్థి ప్రతిభకు నిదర్శనం. నూతన ఆవిష్కరణల కోసం వారు చేసిన కృషి విద్యార్థులందరికీ ఆదర్శం. సైన్స్‌తోనే ప్రగతి అభివృద్ధి సాధ్యమనే నిజాన్ని విద్యార్థులు గుర్తెరగాలి. భవిష్యత్‌లో విద్యార్థులు మరింతగా రాణించేందుకు జిల్లా విద్యాశాఖ ప్రత్యేక శ్రద్ధ చూపుతోంది. జాతీయ స్థాయి పోటీలకు అర్హత సాధించేలా విద్యార్థులను ప్రోత్సహించిన గైడ్ టీచర్లకు శుభాకాంక్షలు...

డాక్టర్ కే నారాయణరెడ్డి, డీఈవో, యాదాద్రి జిల్లా.

పెడల్‌తో నిర్వహించే పిండి మిల్లు



పెడల్ ఆపరేటెడ్ పిండి మిల్లు సాంప్రదాయ మిల్లింగ్ పద్ధతులకు ఆధునిక ఇంజనీరింగ్‌తో మిళితం చేశారు. ధాన్యం ప్రాసెసింగ్ కోసం విద్యుత్‌అవసరాలు లేకుండా ఈ యంత్రాన్ని ఉపయోగించవచ్చు. పెడల్‌తో తొక్కడం ద్వారా ఇది పనిచేస్తుంది. దాని సరళత, స్తోమత, సుస్థిరత స్వయం సమృద్ధిని కోరుకునే కమ్యూనిటీలకు ఆదర్శవంతంగా చేస్తాయి. ఈ వినూత్న పరిష్కారం స్థానిక ఆహార ఉత్పత్తిని ప్రోత్సహిస్తుంది.

- పెడల్ మిల్లును ప్రదర్శిస్తున్న విద్యార్థి రేగు మణికంఠ.

● గైడ్ టీచర్ ఎస్ సునీత, విజ్ఞాన్‌స్కూల్ వంగపల్లి, యాదగిరిగుట్ట

ఆవు పేడను ఎత్తివేసే పరికరం



పాడి రైతులు చేతుల ద్వారా ఎత్తుతున్న ఆవు పేడను ప్రత్యేక ట్రాలీ ద్వారా ఎత్తి తరలించడమే ఈ పరికరం ప్రత్యేకం.స్వల్ప వ్యయం, ప్లాస్టిక్ టబ్బు, ప్లాస్టిక్ షీట్, ఐరన్ ఫ్రేమ్, చక్రాలను ఉపయోగించి ఈ పరికరాన్ని రూపొందించారు. రైతు నేరుగా యంత్రాన్ని నిర్వహించవచ్చు. లేదా హైడ్రాలిక్ సిస్టమ్‌ను అమరిస్తే పేడ ఎత్తి వేసే పని మరింత సులభతరం అవుతుంది. దీంతో రైతులకు శారీరక శ్రమ తప్పడంతో పాటు సమయం ఆదా అవుతుంది.

- పరికరాన్ని ప్రదర్శిస్తున్న విద్యార్థి మణికంఠ.

● గైడ్ టీచర్ వేణుగోపాల్, జడ్పీహెచ్ఎస్ చందుపట్ల, భువనగిరి మండలం.

రైతుల మోకాలి ప్యాడ్స్



మారిన జీవన శైలి తదితర కారణాలతో పాటు వృద్ధాప్యంలో మోకాలి నొప్పులు రావడం సర్వసాధారణం. దీంతో మోకాళ్ల నొప్పులతో రైతులు పనులు చేసుకోలేని పరిస్థితి. అలాగే ఇతర రంగాల్లోనూ ఇదే తరహా సమస్య ఉత్పన్నమవుతోంది. ఈ నేపథ్యంలో భార్గవి ఆవిష్కరించిందే మోకాలి ప్యాడ్. క్షేత్రస్థాయిలో కూడా మోకాలి ప్యాడ్‌ను పలువురు రైతులు వినియోగించి సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

- మోకాలి ప్యాడ్‌తో పనులు చేసుకుంటున్న విద్యార్థి రూపకర్త బుగ్గ భార్గవి.

● గైడ్ టీచర్ బుస్స రమేష్, జడ్పీహెచ్ఎస్ పారుపల్లి, రాజాపేట మండలం.

డీసీఎంఎస్ చైర్మన్‌గా బోళ్ల వెంకట్‌రెడ్డి ఏకగ్రీవ ఎన్నిక

- రైతుల సంక్షేమం కోసం కృషి చేయాలి
- మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి



డీసీఎంఎస్ చైర్మన్‌గా బోళ్ల వెంకటరెడ్డికి ధ్రువీకరణ పత్రాన్ని అందజేస్తున్న మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, అధికారులు

నల్లగొండ, జూన్ 22: నాగార్జున జిల్లా సహకార మార్కెటింగ్ సంఘం (ఎన్‌డీసీఎంఎస్) చైర్మన్‌గా కేతేపల్లి పీఏసీఎస్ చైర్మన్ బోళ్ల వెంకటరెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఉమ్మడి నల్లగొండ జిల్లా డీసీఎంఎస్ చైర్మన్‌గా కొనసాగిన బీఆర్ఎస్‌కు చెందిన సూర్యాపేటకు చెందిన వట్టె జానయ్యయాదవ్ ఆ పార్టీకి రాజీనామా చేసి బీఎస్పీలో చేరడంతో పదవిని కోల్పోయారు. దీంతో గత ఆరు నెలలుగా వైస్‌చైర్మన్‌గా దుర్గంపూడి నారాయణరెడ్డి తాత్కాలిక చైర్మన్‌గా వ్యవహరించారు. కో ఆపరేటివ్ నిబంధనల మేరకు ఆరు నెలల్లో చైర్మన్‌ను ఎన్నుకోవాల్సి ఉంది. ఈ నేపథ్యంలో జిల్లా సహకార అధికారులు శనివారం చైర్మన్ ఎన్నిక ప్రక్రియను నల్లగొండ జిల్లా కేంద్రంలో నిర్వహించారు. మొత్తం 10 మంది డైరెక్టర్లు ఉండగా, అందులో కేతేపల్లి పీఏసీఎస్ చైర్మన్ బోళ్ల వెంకట్‌రెడ్డి మాత్రమే నామినేషన్ దాఖలు చేయడంతో ఆయన ఎన్నిక ఏకగ్రీవమైంది. సూర్యాపేటకు చెందిన డీసీఏవో జి.శ్రీనివాసరావు ఎన్నికల అధికారిగా వ్యవహరించారు. బోళ్ల వెంకటరెడ్డి ఏకగ్రీవంగా ఎన్నిక కావడంతో ఆయనకు ఎన్నికల అధికారి డీసీఏవో జి.శ్రీనివాసరావు ధ్రువీకరణ పత్రం అందజేశారు. ఎన్నిక ప్రక్రియ ముగిసిన అనంతరం రోడ్లు, భవనాలశాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి డీసీఎంఎస్‌లో జరిగిన ప్రమాణ స్వీకార కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా నూతన చైర్మన్‌ను అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఉమ్మడి జిల్లా డీసీఎంఎస్ అభివృద్ధికి నూతనంగా ఎన్నికైన చైర్మన్‌తో పాటు పాలకవర్గ సభ్యులు కృషి చేయాలని ఆకాంక్షించారు. రైతుల సంక్షేమమే ధ్యేయంగా పాలకవర్గం పనిచేయాలని డీసీఎంఎస్‌ను ఆర్థికంగా నిలబెట్టేందుకు ప్రభుత్వం సహాయసహకారాలు అందిస్తుందన్నారు. డీసీఎంఎస్ ద్వారా రైతులకు ఎరువులు, విత్తనాలను సరఫరా చేయడానికి పాలకవర్గం అన్నిఏర్పాట్లు చేసి వ్యవసాయ సీజన్లలో రైతులకు అందుబాటులో ఉండటంతో ధాన్యం కొనుగోళ్లలో ముందు ఉండాలన్నారు. కార్యక్రమంలో వైస్‌చైర్మన్ దుర్గంపూడి నారాయణరెడ్డి, డైరెక్టర్లు గుడిపాటి సైదులు, ధనావత్ జయరాం, డీ వెంకటేశ్వర్లు, నెల్లూరి ఉషారాణి, ఎస్.అనురాధ, కొండ సరిత, కర్నాటి లింగయ్యతో పాటు డీసీవో కిరణ్‌కుమార్, డీసీఎంఎస్ బిజినెస్ మేనేజర్ నాగిళ్ల మురళి, నల్లగొండ డీసీసీ అధ్యక్షుడు శంకర్‌నాయక్, మునిసిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు గుమ్ముల మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.


గుట్టలో శాస్త్రోక్తంగా నిత్యపూజలు



ఆలయంలో నిత్యకల్యాణోత్సవం నిర్వహిస్తున్న పూజారులు

భువనగిరి అర్బన్, జూన్ 22: యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామి దివ్యక్షేత్రంలో శనివారం శాస్త్రోక్తంగా నిత్యపూజలు జరిగాయి. సుప్రభాత సేవతో స్వయంభువులను మేల్కొలిపిన అర్చక స్వాములు గర్భగుడిలో కొలువుదీరిన స్వయంభువులను, సువర్ణ ప్రతిష్ఠామూర్తులను వేదమంత్రోచ్ఛరణ, మంగళవాయిద్యాల నడుమ పంచామృతాలతో అభిషేకించి, తులసీ దళాలతో అర్చించారు. ప్రాకార మండపంలో సుదర్శన హోమం, నిత్య కల్యాణోత్సవం ఆగమశాస్త్రరీతిలో వైభవంగా చేపట్టారు. అష్టభుజి ప్రాకార మండపంలో స్వామి అమ్మవార్లను ముగ్ధమనోహరంగా అలంకరించి ప్రత్యేక వేదికపై తీర్చిదిద్ది సుదర్శన శతక పఠనాలతో హవనం నిర్వహించిన అనంతరం గజవాహన సేవలో ఊరేగించి విశ్వక్సేనుడి తొలిపూజలతో నిత్య తిరుకల్యాణోత్సవం ఆగమశాస్త్రరీతిలో చేపట్టారు. సాయంత్రం ప్రధానాలయ ముఖమండపంలో దర్బారు సేవోత్సవం చేపట్టిన ఆచార్యులు అలంకార వెండి జోడు సేవలు, సహస్రనామార్చనలు జరిపారు. పాతగుట్ట ఆలయంలో నిత్యకైంకర్యాలు వేదమంత్రాలు మంగళవాయిద్యాల నడుమ వైభవంగా నిర్వహించారు. ఈ ఆలయాల్లో సాయంత్ర ం వెండి జోడు సేవలు, సహస్రనామార్చనలు శాస్త్రోక్తంగా జరిగాయి. శివాలయంలో పర్వతవర్ధిని సమేత రామలింగేశ్వరస్వామికి, మహామండపంలో స్ఫటికమూర్తులకు నిత్యారాధనలు, యాగశాలలో నిత్య రుద్రహవన పూజలు శైవాగమ పద్ధతిలో కొనసాగాయి. ఆలయ ఖజానాకు వివిధ విభాగాల ద్వారా రూ.43,75,437 ఆదాయం సమకూరినట్లు ఈవో ఏ.భాస్కర్‌రావు తెలిపారు. కాగా, లీగల్ అండ్ లీజెస్ విభాగంలో సూపరింటెండెంట్‌గా విధులు నిర్వహిస్తున్న సత్యనారాయణశర్మను సస్పెండ్ చేసినట్లు ఈవో తెలిపారు. సమాచారం లేకుండా విధులకు గైర్హాజరు కావడంతో కార్యాలయానికి సంబంధించి కోర్టు కేసులకు తీవ్ర ఆటంకం ఏర్పడినందున ఆయన్ను సస్పెండ్ చేశారు. అదేవిధంగా కొండకింద లక్ష్మీపుష్కరిణి పరిసరాల్లో జూదం ఆడుతున్న ముగ్గురిని భద్రత సిబ్బంది(ఎస్పీఎఫ్) స్థానిక పోలీసులకు అప్పగించారు. గిరిప్రదక్షిణ దారిలో ఎటువంటి వాహనాలు ప్రవేశించకుండా ఉండేందుకు గేట్లు, యాదరుషీ విగ్రహంతో పాటు ఆలయం, దారి వెంట బెంచీలు, తాగునీటి సదుపాయంపై ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్యతో చర్చించి తగిన చర్యలు చేపట్టనున్నట్లు ఈవో తెలిపారు. కల్యాణకట్ట వద్ద భక్తులను విచారించి నాయీబ్రాహ్మణులు డబ్బు అడిగిన విషయం ఆయన దృష్టికి వచ్చినట్లు, ఈ మేరకు సంజాయిషి నోటీసు అందజేసినట్లు తెలిసింది. అన్నదానానికి సంబంధించి వంటశాల, లక్ష్మీపుష్కరిణి, యాదరుషి విగ్రహాన్ని ఈవో పరిశీలించారు. కొండపైన సంగీత సభల్లో భాగంగా శ్రీ అన్నమాచార్య కీర్తన వైభవం(రమేష్ బాబు) బృందం సంగీత కార్యక్రమం, శ్రీ భరద్వాజ నాట్యమండలి కూచిపూడి నృత్య ప్రదర్శన జరిగింది.

పొంగిపొర్లుతున్న డ్రైనేజీతో ఇబ్బందులు





మురుగుకాల్వ నుంచి బయటకు వస్తున్న మురుగునీరు, రహదారిపై నిలిచి నీరు

నల్లగొండ, జూన్ 22 : నల్లగొండ జిల్లా కేంద్రంలోని 37వ వార్డులో సమస్యలు తిష్ట వేశాయి. అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని స్థానిక ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అపరిశుభ్రత సమస్యతో పాటు అధ్వానమైన రోడ్లు, డ్రైనేజీ సమస్య తీవ్రంగా ఉంది. వార్డులోని సాయిపూజా అపార్ట్‌మెంట్ వద్ద డ్రైనేజీ పొంగిపొర్లుతోంది. చిన్నపాటి వర్షం వచ్చినా నీటి నిల్వ ఉండి అపరిశుభ్రత పేరుకపోతుంది. ఈ అపార్ట్‌మెంట్ సమీపంలో మూడు పాఠశాలలు ఉన్నాయి. నిత్యం స్కూల్ పిల్లలు అటూ నుంచి వెళ్లాల్సి ఉంటుంది. డ్రైనేజీలో పూడిక తీయకపోవడంతో నీళ్ల రోడ్డుపైకే వస్తున్నాయి. స్థానికులు అనేకసార్లు అధికారులతో పాటు స్థానిక ప్రజాప్రతినిధికి తెలియజేసినా ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా పరిస్థితి తయారైందని స్థానికులు ఆరోపిస్తున్నారు. అధికారులు నిధులు మంజూరు చేయకపోవడంతో డ్రైనేజీ పనులను చేయలేక పోతున్నామని ప్రజాప్రతినిధులు చెబుతుండటంతో సమస్యకు పరిష్కారం దొరకడం లేదు.

దుర్వాసనతో ప్రజలకు ఇబ్బందులు


డ్రైనేజీలో పూడికతీత తీయకపోవడంతో డ్రైనేజీ నీరంతా సాయిపూజా అపార్ట్‌మెంట్ వద్ద ఉన్న మ్యాన్‌హోల్ నుంచి బయటకు వస్తోంది. ఆ నీటి దుర్వాసన భరించలేక తాము తలుపులు పెట్టుకుని ఉండాల్సి వస్తుందని వాపోతున్నారు. తాము రోగాల బారిన పడే ప్రమాదం ఉందని, మంచినీటి సరఫరా చేసే పైపులు ఎక్కడైనా పగిలి ఉండే ఈ మురుగునీరు పైపుల ద్వారా సరఫరా అయ్యే ప్రమాదం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

సమస్యను పరిష్కరించాలి: దాల్వాయి పద్మ



మురుగునీరుతో దుర్వాసన వచ్చి ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. ఇంట్లో నుంచి బయటకు వచ్చే పరిస్థితి లేదు. అనేకసార్లు కౌన్సిలర్, అధికారుల దృష్టికి తీసుకెళ్లాం. అయినా సమస్య పరిష్కారం కాలేదు. నిధులు మంజూరయితేనే పనిచేయిస్తామంటున్నారు. తక్షణమే సమస్యను పరిష్కరించాలి.

ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం: తేలుకుంట్ల భారతమ్మ



రోడ్డుపై డ్రైనేజీ నీరు పొంగిపొర్లుతోంది. మ్యాన్‌హోల్‌లో పూడిక ఉండటంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. మురుగునీరు వల్ల దోమలు వస్తున్నాయి. గుంటల్లో నీరునిల్వ ఉండటంతో చెత్తాచెదారం పేరుకపోతోంది. తక్షణమే అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి ఈ సమస్యలను పరిష్కరించాలి.

నీట్‌పరీక్షను రద్దు చేయాలి: ఎస్ఎఫ్ఐ



భువనగిరిలో కేంద్ర ప్రభుత్వ దిష్టి బొమ్మను దహనం చేస్తున్న ఎస్ఎఫ్ఐ కార్యకర్తలు

భువనగిరి టౌన్, జూన్ 22 : పేపర్ లీకేజీతో లక్షలాది మంది విద్యార్థులకు నష్టం కలిగించిన నీట్ పరీక్షను రద్దు చేసి, తిరిగి నిర్వహించాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎల్ మూర్తి అన్నారు. నీట్ పరీక్ష పేపరు లీక్‌ను నిరసిస్తూ శనివారం యాదాద్రిభువనగిరి జిల్లా కేంద్రంలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేపర్ లీకేజీ నిందితులను గుర్తించి, కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం స్పందించకుంటే రాష్ట్రానికి చెందిన కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌ల కార్యాలయాలను ముట్టడిస్తామన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు చింతల శివ, లావుడ్య రాజు తదితరులు పాల్గొన్నారు.

పుస్తకాల పేరుతో విద్యావ్యాపారాన్ని అరికట్టాలి

వలిగొండ : పుస్తకాల పేరుతో ప్రైవేట్ విద్యాసంస్థలు కొనసాగిస్తున్న విద్యా వ్యాపారాన్ని అరికట్టాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు వేముల నాగరాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం యాదాద్రిభువనగిరి జిల్లా వలిగొండ మండలకేంద్రంలోని మాంటిస్సోరి ప్రైవేట్ పాఠశాల ముందు ధర్నా నిర్వహించారు. స్టేషనరీ, పుస్తకాలు విక్రయించవద్దని ప్రభుత్వం సర్క్యులర్ జారీ చేసినప్పటికీ ప్రైవేట్ పాఠశాలలు పట్టించుకోవడం లేదాన్నారు. విద్యాశాఖ అధికారులు స్పందించి పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు నరేందర్, సాయి, వినయ్, చంద్రశేఖర్, పవన్, ఫర్దీన్ తదితరులు పాల్గొన్నారు.

సంఘాలు, చట్టాల పేరుతో బెదిరిస్తున్నారు



ఆర్డీవో శ్రీనివాస్‌రావుకు వినతిపత్రం అందజేస్తున్న ప్రైవేటు విద్యాసంస్థల యాజమాన్యం

మిర్యాలగూడ, జూన్ 22: విద్యార్థి సంఘాలు, కులసంఘాలు, ఆర్టీఏ చట్టాల పేరుతో బెదిరిస్తున్నారని తెలంగాణ రికగ్నైజ్‌డ్ స్కూల్స్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ రాష్ట్ర నాయకులు రవీందర్‌రెడ్డి, శ్రీరామకవచం నాగరాజు, శ్రీనివాస్‌చారిలు ఆరోపించారు. ఈ మేరకు శనివారం ట్రస్మా ఆధ్వర్యంలో నల్లగొండ జిల్లా మిర్యాలగూడ ఆర్డీవో శ్రీనివాసరావు, డీఎస్పీ రాజశేఖరరాజు, ఎంఈవో బాలాజీనాయక్‌లకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ గుర్తింపుతో నిబంధనలకు లోబడి విద్యాసంస్థలు నిర్వహిస్తున్నామన్నారు. ఐదు వేల మంది టీచింగ్, నాన్‌టీచింగ్ సిబ్బందికి జీవనోపాధి కల్పిస్తున్నట్లు చెప్పారు. కుల సంఘాల పేరుతో, విద్యార్థి సంఘాల పేరుతో కొందరు నేరుగా పాఠశాలలకు వచ్చి యాజమాన్యాలను భయభ్రాంతులకు గురిచేస్తున్నారని ఆరోపించారు.వివిధసంఘాల వారు నేరుగా పాఠశాలలకు రాకుండా కట్టడి చేయాలని అధికారులకు అందజేసిన వినతి పత్రంలో కోరినట్లు తెలిపారు.కార్యక్రమంలో పాఠశాలల నిర్వాహకులు అహ్మద్, ఓరుగంటి శ్యామ్‌సుందర్, నర్సిరెడ్డి, మహ్మద్‌ఖాన్, సాయి శ్రీనివాస్, వరప్రసాద్, జయరాజ్, చార్లెస్, శ్రీపతి శ్రీనివాస్, అమరేందర్‌రెడ్డి, శ్రీధర్‌రెడ్డి, వెంకట్, సురేందర్‌రెడ్డి, శ్రీనివాసరెడ్డి, రియాజ్ పాల్గొన్నారు.

సీఎంఆర్ బకాయిపై కేసు నమోదు



రైస్‌మిల్లులో రికార్డులను పరిశీలిస్తున్న అధికారులు

గరిడేపల్లి, జూన్ 22: సీఎంఆర్ బకాయి ఉన్న రైస్‌మిల్లుపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు సివిల్ సప్లయి అధికారి మోహన్‌బాబు తెలిపారు. శనివారం రాత్రి సూర్యాపేట జిల్లా గరిడేపల్లి మం డలం గడ్డిపల్లిలోని ఎంకేఆర్ రైస్‌మిల్లులో సివిల్ సప్లయ్ జిల్లా అధికారులు తనిఖీలు నిర్వహించారు. మిల్లులోని రికార్డులను పరిశీలించారు. ప్రభుత్వానికి అందించాల్సిన సీఎంఆర్ వివరాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ 15,749 టన్నుల సీఎంఆర్ బియ్యాన్ని ప్రభుత్వానికి అందించాల్సి ఉండగా కేవలం 1,270 టన్నుల బియ్యం మాత్రమే అందించారని, ఇంకా 14,524 టన్నుల సీఎంఆర్ అందించాల్సి ఉందన్నారు. తనిఖీల్లో జిల్లా సివిల్ సప్లయ్ అధికారి మోహన్‌బాబు, డీఎం రాములు, హుజూర్‌నగర్, కోదాడ డీటీఎస్ అధికారులు రాజశేఖర్, రాంరెడ్డి గరిడేపల్లి తహసీల్దార్ బండ కవిత, ఆర్ఐ రాంబాబు పాల్గొన్నారు.

12 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

తిరుమలగిరి రూరల్, జూన్ 22 : సూర్యాపేట జిల్లా తిరుమలగిరి మండలం రాజ్యానాయక్‌తండాలో 11 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ సత్యనారాయణ తెలిపారు. శనివారం ఆయన తెలిపిన వివరాల ప్రకారం రాజ్యానాయక్‌తండాలో మాలోతు రంగమ్మ ఇంటిలో అక్రమంగా రేషన్ బియ్యం నిల్వ చేసినట్లు విశ్వసనీయ సమాచారం అందిందన్నారు. సిబ్బందితో వెళ్లి దాడి చేసి నిల్వలను గుర్తించి స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు. మండలంలోని చుట్టు పక్క గ్రామాలల్లో పేదలకు ప్రభుత్వం పంపిణీ చేసిన బియ్యాన్ని తక్కువ ధరకు కొనుగోలు చేసి ఇతర ప్రాంతాల్లో అధిక ధరకు విక్రయిస్తున్న యాదాద్రిభువనగిరి జిల్లా రాళ్ల గ్రామానికి చెందిన ధరావత్ బిచ్చపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

హైవేపై ఫ్లైఓవర్ నిర్మాణానికి నేడు భూమిపూజ


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యేలు వీరేశం, బీఎల్ఆర్

చిట్యాల, జూన్ 22: జాతీయ రహదారిపై చిట్యాలలో 65వ నెంబర్ ఫ్లైఓవర్ నిర్మాణానికి ఆదివారం చిట్యాలలో మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి భూమి పూజ చేయనున్నట్లు ఎమ్మెల్యే వేముల వీరేశం తెలిపారు. చిట్యాల మునిసిపల్ కార్యాలయంలో శనివారం మిర్యాలగూడెం ఎమ్మెల్యే బీఎల్ఆర్‌తో కలిసి విలేకరులతో మాట్లాడారు. ఫ్లైఓవర్ నిర్మాణంతో రోడ్డు ప్రమాదాలకు, పట్టణ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలకు చెక్ పడనుందని అన్నారు. కీలకశాఖలైన ఇరిగేషన్, ఆర్అండ్‌బీ శాఖలు ఉమ్మడి నల్లగొండ జిల్లా మంత్రుల ఆధీనంలో ఉన్నందున వారి సహకారంతో జిల్లాలో నీటి ప్రాజెక్టులు, రోడ్ల అభివృద్ధి పనులు వేగంగా జరుగుతున్నాయని అన్నారు. త్వరలో ధర్మారెడ్డి, పిలాయిపల్లి కాల్వలను పూర్తి చేసి సాగు నీరందిస్తామని, చిట్యాల భువనగిరి రోడ్డు నాలుగు లేన్లుగా అభివృద్ధి చేస్తామన్నారు. పంచాయతీరాజ్ రోడ్లను ఆర్అండ్‌బీగా కన్వర్ట్ చేసి అభివృద్ధి చేస్తామని పేర్కొన్నారు. లోవోల్టేజీ సమస్య లేకుండా చేయకుండా అవసరమైనని ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మునిసిపల్ చైర్మన్ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, నాయకులు పోకల దేవదాస్, జడల చినమల్లయ్య, గుడిపాటి లక్ష్మీనర్సింహ్మా, కాటం వెంకటేశం, ఎద్దులపురి కృష్ణ, ఏర్పుల పరమేశం తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మాస కల్యాణోత్సవం


చెర్వుగట్టులో మాస కల్యాణం చేస్తున్న అర్చకస్వాములు

నార్కట్‌పల్లి, జూన్ 22: మండలంలోని ప్రసిద్ధ శైవక్షేత్రం చెర్వుగట్టు పార్వతీ జడల రామలింగేశ్వరస్వామి దేవస్థానం, గోపలాయపల్లి గుట్టపై గల వారిజాల వేణుగోపాలస్వామి దేవస్థానాల్లో శనివారం మాస కల్యాణోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ప్రతీ నెలా పౌర్ణమి తిథిని పురస్కరించుకుని లోక కల్యాణార్థం స్వామి అమ్మవార్ల కల్యాణాలను నిర్వహిస్తూ ఉన్నారు. చెర్వుగట్టులో ఆలయ ప్రధానార్చకుడు పోతులపాటి రామలింగేశ్వరశర్మ సహార్చకుడు సురేష్‌శర్మ, వేదపండితులు, భక్తులు పాల్గొన్నారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఆత్మగౌరవ కవాతును విజయవంతం చేయాలి

నిడమనూరు, జూన్ 22: వరంగల్‌లో జూలై 7వ తేదీన నిర్వహించనున్న మాదిగల ఆత్మగౌరవ కవాతును విజయవంత చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు ఇరిగి శ్రీశైలంమాదిగ, ఎమ్మెస్పీ జిల్లా అధ్యక్షుడు బకరం శ్రీనివాస్‌మాదిగ అన్నారు. నిడమనూరులో శనివారం నిర్వహించిన సంఘం ముఖ్య కార్యకర్తల సమావేశంలో వారు మాట్లాడారు. మాదిగ జాతి కోసమే కాకుండా సమాజ శ్రేయస్సు కోసం దండోరా ఉద్యమం ప్రారంభించి 30 ఏళ్లు పూర్తవుతున్న సందర్భంగా వరంగల్‌లో మాదిగల ఆత్మ గౌరవ కవాతు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. షెడ్యూల్ కులాల్లోని అన్ని ఉప కులాలకు జనాభా నిష్పత్తి ప్రకారం రిజర్వేషన్లు కల్పించాలన్నారు. ప్రధాని నరేంద్రమోదీ నాయకత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వంలో ఎస్సీ వర్గీకరణ సాధిస్తామని ఆశాభావం వ్యక్తం చేశారు. జూలై 7వ తేదీ నాటికి గ్రామ, మండలస్థాయి కమిటీల నియమించాలని అన్నారు. ఆత్మగౌరవ కవాతుకు లక్షలాదిగా తరలిరావాలని కోరారు. సమావేశంలో సంఘం నాయకులు బొజ్జ చిన్నామాదిగ, మడుపు శ్రీనివాస్, ఏర్పుల వెంకటయ్య, నాగయ్య, తరి ఏడుకొండలు, రవికుమార్, వెంకట్, పుల్లయ్య, వెంకన్న, ఎల్లయ్య, శంకరయ్య, వెంకటేశం, రమణయ్య, శ్రీనివాస్, యుగంధర్, సైదయ్య, శంకర్‌బాబు పాల్గొన్నారు.

కోడ్ ముగిసినా తొలగని ముసుగు

చండూరు, జూన్ 22: పార్లమెంట్, పట్టభద్రుల శాసనమండలి ఎన్నికల కోడ్ ముగిసినా చండూరు పట్టణంలో కొన్ని విగ్రహాలకు ముసుగులు తొలగించలేదు. ప్రధాన చౌరస్తాలో తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ జయశంకర్ విగ్రహానికి మునిసిపల్ అధికారులు వేసిన ముసుగు నేటికీ తీయలేదు. పక్కనే ఉన్న కొండా లక్ష్మణ్‌బాపూజీ విగ్రహానికి మాత్రం ముసుగు తొలగించారు. ప్రొఫెసర్ జయశంకర్ వర్ధంతి శుక్రవారం ఉన్నా ఆ విగ్రహం వైపు అధికారులు, ఉద్యమకారులు సైతం కన్నెత్తి చూడలేదు. ఇంతేకాకుండా పట్టణంలో ఉన్న పలువురు నాయకుల విగ్రహాలకు సైతం ముసుగు తొలగించకపోవడంతో అధికారులపై ప్రజలు మండిపడుతున్నారు.

స్థానికులకు పరిశ్రమల్లో ఉద్యోగాలు ఇవ్వాలి

చిట్యాలరూరల్, జూన్ 22: ఏ ప్రాంతంలోనైనా స్థానికంగా పరిశ్రమలను నెలకొల్పితే ఆ ప్రాంతానికి చెందిన స్థానికులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలను కల్పించాలని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి మల్లం మహేష్ డిమాండ్ చేశారు. చిట్యాల మండలం వెలిమినేడులో శనివారం డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో యువజన సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంతో మంది యువత ఉన్నత విద్యనభ్యసించినా కూడా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు రావడం లేదని, దీంతో ఆర్థిక సమస్యలు నెలకొంటున్నాయని అన్నారు. స్థానికంగా ఏర్పాటయ్యే పరిశ్రమల నుంచి వెలువడే కాలుష్యం బారిన స్థానికులు పడుతుంటే పరిశ్రమల్లో ఉద్యోగాలను మాత్రం స్థానికులకు కాకుండా ఇతర ప్రాంతాల వారికి ఇవ్వడం స్థానికుల పొట్టకొట్టడమేనన్నారు. స్థానిక పరిశ్రమల్లో స్థానికులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలను కల్పించాలని లేనిచో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. సమావేశంలో సంఘం మండల అధ్యక్షుడు పంది నరేష్, ఆడెపు రమేష్, గోలి సాయికిరణ్, అరూరి పవన్, ఆమెపు మహేష్, గడ్డం దత్తాత్రేయ, వీరమల్ల జితేందర్, నాని తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ బలోపేతానికి కృషి చేయాలి

నల్లగొండ టౌన్, జూన్ 22: కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు గుమ్ముల మోహన్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని వివిధ పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు శనివారం మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి క్యాంపు కార్యాలయంలో భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు గుమ్ముల మోహన్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా 20వ వార్డు పెద్దబండకు చెందిన బీఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకుడు బోళ్ల వెంకట్ ముదిరాజ్‌కు వారు కండువాను కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో నాయకులు అల్లి సుభాష్‌యాదవ్, కౌన్సిలర్ కేసాని వేణగోపాల్‌రెడ్డి, మాజీ సర్పంచ్ మర్రి యదగిరి, పాలకూరి రమేష్, కత్తుల విజయ్, సత్యనారాయణ, పోలే జయకుమార్, తలకొప్పుల గిరి, చందు, తురుమలేష్, ఆకిటి అశోక్, మర్రిబిక్షపతి, మర్రి నరేష్, చిన్నపాక అశోక్, రామరాజు, కొండల్, మోహన్, గిరి తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగులు బాధ్యతతో పనిచేయాలి

● *మునిసిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి*

నల్లగొండ, జూన్ 22: మునిసిపల్ కార్యాలయంలో పనిచేసే ప్రతి ఉద్యోగి బాధ్యతతో పనిచేయాలని మునిసిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని మునిసిపల్ కార్యాలయంలో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యాలయంలో ఉద్యోగుల పనితీరులో నిర్లక్ష్యం స్పష్టంగా కనపడుతుందని అన్నారు. పని చేయాలని లేనివారు స్వచ్ఛందంగా వెళ్లి పోవచ్చని సూచించారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్లు బాధ్యతారహితంగా వ్యవహరిస్తుడంటంతో ప్రజల నుంచి తాము ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. ఇక బైపాస్ నిర్మాణ విషయంలో శాటిలైట్ సర్వే మాత్రమే జరిగిందని, కనీసం భూసేకరణ చేయలేదన్నారు. దీనిపై కొంతమంది రాజకీయ నాయకులు తమ పబ్బం గడుపుకోవడం కోసం దుష్ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. ప్రజాభీష్టం మేరకే నిర్ణయం ఉంటుందన్నారు. అదే విధంగా నల్లగొండ పట్టణంలో రానున్న రోజుల్లో సుమారు రూ.50కోట్లతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు కౌన్సిలర్లలందరూ సహకరించాలన్నారు. బీజేపీ మునిసిపల్ ఫ్లోర్‌లీడర్ బండారు ప్రసాద్ మాట్లాడుతూ బైపాస్ రోడ్డు విషయంలో ఆప్షన్-1, 2లను కాదని 3ని ఎందుకు ఎంచుకోవాల్సి వచ్చిందని 'ఆంధ్రజ్యోతి' పత్రికలో వచ్చిన కథనాన్ని చూపి స్తూ ప్రశ్నించారు. ఇకపోతే అధికారుల పనితీరు స్థానిక ప్రజాప్రతినిధుల ను నిర్వీర్యం చేసేలా ఉందన్నారు. ఆప్షన్-3 ని బీఆర్ఎస్ వ్యతిరేకిస్తున్నట్లు కౌన్సిలర్ అభిమన్యు శ్రీనివాస్ పేర్కొన్నారు. బీజేపీ కౌన్సిలర్ పిల్లి రామరాజు మాట్లాడుతూ వాటర్ ట్యాంకులో వ్యక్తి పడి మృతి చెందిన సంఘటనపై చేసిన విచారణ ఎంతవరకు వచ్చిందని ప్రశ్నించారు. మిగిలిన ట్యాంకుల వద్ద ఎలాంటి రక్షణ చర్యలు ఏర్పాటు చేశారని అన్నారు. దీనికి చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి స్పందించి మాట్లాడుతూ సంఘటనకు బాధ్యులపై చర్యలు తీసుకోవడంతో పాటు మిగిలిన ట్యాంకులపై మూతలు వేయించి తాళాలు వేయించినట్లు పేర్కొన్నారు.

వేస్ట్ చెత్తపై రీసైక్లింగ్‌పై అవగాహన

పట్టణంలో ఉత్పన్నమవుతున్న వేస్ట్ చెత్తను రీసైక్లింగ్ చేయడం వల్ల వ చ్చే లాభాలపై ఐటీసీ కంపెనీ చీఫ్ మేనేజర్ ఉమాకాంత్ ప్రజాప్రతినిధుల కు, అధికారులకు ప్రొజెక్టర్‌పై అవగాహన కల్పించారు. ప్రతీ వేస్ట్ చెత్తను రీసైక్లింగ్ చేయవచ్చని, తద్వారా ఆదాయం సమకూరడంతో పాటు పర్యావరణాన్ని కాపాడిన వారమవుతామని అన్నారు. ఇలా చేస్తే ఇప్పుడున్న డంపింగ్ యార్డును అందమైన పార్క్‌గా తీర్చిదిద్దుకోవచ్చన్నారు. ఒకవేళ రీసైక్లింగ్ చేయకపోతే పర్యావరణం దెబ్బతిని భవిష్యత్తు తరాలు ఇబ్బంది లు ఎదుర్కోక తప్పదన్నారు. రీసైక్లింగ్‌కు అధికారులు, ప్రజాప్రతినిధులు సహకరించాలని కోరారు. సమావేశంలో కమిషనర్ సయ్యద్ ముషారఫ్ అలీ, ఈఈ రాములు, ఏసీపీ నాగిరెడ్డి, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.


బైపాస్ రోడ్డు అలైన్‌మెంట్ మార్చాలని నిరసన తెలుపుతున్న కౌన్సిలర్లు

సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం

పెద్దఅడిశర్లపల్లి, చింతపల్లి, జూన్ 22: రాష్ట్రంలో రైతులకు ఏకకాలంలో రుణమాఫీ చేస్తానని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించడంతో పెద్దఅడిశర్లపల్లి, చింతపల్లి మండలాల్లో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సంబురాలు నిర్వహించారు. శనివారం ఆయా మండల కేంద్రాల్లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అంటే రైతు ప్రభుత్వం అని సీఎం రేవంత్ రెడ్డి నిరూపించారని అన్నారు. రైతుల పక్షాన సీఎం రేవంత్‌రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. ఐదేళ్లుగా రైతులు రుణమాఫీ కాక తీవ్ర మనోవేదనకు గురయ్యారని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారెంటీలను పకడ్బందీగా అమలు చేస్తుందని అన్నారు.


అంగడిపేట ఎక్స్‌రోడ్డు వద్ద సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న రైతులు, నాయకులు


చింతపల్లిలో రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

● పెద్దఅడిశర్లపల్లిలో కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి కుక్కల గోవర్ధన్‌రెడ్డి, మండల అధ్యక్షుడు వీరబోయిన ఎల్లయ్య ఆధ్వర్యంలో సంబురాలు నిర్వహించారు. కార్యక్రమంలో వర్కింగ్ ప్రెసిడెంట్ నెర్మటీ సతీష్‌రెడ్డి, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు రమేష్‌నాయక్, ఆర్వపల్లి నర్సింహ, కసిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, పాండునాయక్, చందునాయక్, వెంకటయ్య, శివాజీనాయక్, నారాయణ, పాండునాయక్, అక్బర్, పరమేష్, శేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

●చింతపల్లిలో నిర్వహించిన సమావేశంలో కాంగ్రెస్ పార్టీ మండల అధికార ప్రతినిధి ముచ్చర్ల యాదగిరి, సహకార సంఘం చైర్మన్ లింగంపల్లి వెంకటయ్య, జితేందర్‌రెడ్డి, దాసరి శ్రీనివాస్‌యాదవ్, గోవిందు, గిరి తదితరులు పాల్గొన్నారు.

పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలి : వీరేశం

నకిరేకల్, జూన్ 22: పిల్లలను ప్రభుత్వ పాఠశాలలోనే చేర్పించాలని ఎమ్మెల్యే వేముల వీరేశం తల్లిదండ్రులకు సూచించారు. బడిబాట కార్యక్రమంలో భాగంగా నకిరేకల్ పట్టణంలోని జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులతో శనివారం భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మెయిన్ సెంటర్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలలను మరింత బలోపేతం చేయాలని, పేద విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలన్న ఉద్దేశ్యంతో సీఎం రేవంత్ రెడ్డి కృషి చేస్తున్నారని తెలిపారు. తల్లిదండ్రులు పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించి ప్రభుత్వం అందిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో టీపీసీసీ మేనిఫెస్టో కమిటీ సభ్యుడు చామల శ్రీనివాస్, ఎంపీపీ బచ్చుపల్లి శ్రీదేవి గంగాధర్‌రావు, ఎంఈవో మేకల నాగయ్య, కౌన్సిలర్లు గాజుల సు కన్య శ్రీనివాస్, కందాళ భిక్షంరెడ్డి, నాయకులు పన్నాల రాఘవరెడ్డి, యాసారపు వెంకన్న తదితరులు పాల్గొన్నారు.


నకిరేకల్‌లో బడిబాట కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వీరేశం

బడి పిల్లల నమోదు పెంచాలి : ఎంఈవో బాలునాయక్

పెద్దవూర: మండలంలోని కొత్త గూడెం పాఠశాలను శనివారం ఎంఈవో లావూరి బాలునాయక్ సందర్శించారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచేలా ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని, ఉపాధ్యాయులకు సూచించారు. విద్యార్థులకు నాణ్యతతో కూడిన మధ్యాహ్న భోజనాన్ని అందించాలన్నారు. ఆయన వెంట ప్రధానోపాధ్యాయుడు వెంకటరమణ, ఉపాధ్యాయురాలు లక్ష్మమ్మ ఉన్నారు.

2018 నుంచి రుణమాఫీ వర్తింపజేయాలి

నల్లగొండటౌన్, జూన్ 22: రైతుల రుణమాఫీ 2018 జూన్ ఖరీఫ్ సీజన్ నుంచి 2024 వరకు వర్తింపజేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు బండా శ్రీశైలం, సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు, డీసీసీబీ సహకార బ్యాంకు మాజీ జిల్లా వైస్ చైర్మన్ సయ్యద్ హాశం అన్నారు. సీపీఎం ఆధ్వర్యంలో శనివారం కలెక్టరేట్‌లో డీఆర్వో రాజ్యలక్ష్మికి వినతిపత్రం అందజేసి మాట్లాడారు. ఏకకాలంలో రూ.2లక్షల రైతు రుణమాఫీ చేయడం హర్షనీయమని అన్నారు. 2018 డిసెంబరు నుంచి 2023 డిసెంబరు వరకు కాల పరిమితి విధించడం వల్ల కొంతమంది రైతులకు రుణమాఫీ వర్తించక ఇబ్బందులు పడాల్సి వస్తుందని అన్నారు. ప్రభుత్వం పునరాలోచన చేసి 2018 జూన్ నుంచి నేటి వరకు రైతుల బ్యాంకు రుణాలు మాఫీ అయ్యే విధంగా చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. గత ప్రభుత్వం మాదిరిగా కాకుండా ఏకకాలంలో రుణమాఫీ చేయాలని అన్నారు. వ్యవసాయ పెట్టుబడులకు తక్షణమే బ్యాంకు రుణాలు ఇవ్వాలని, ఎరువులు, విత్తనాలు పురుగుల మందులు అందుబాటులో ఉంచాలని సూచించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు ఎండీ సలీం, దండంపల్లి సత్తయ్య, మారగోని నగేష్ రైతు సంఘం జిల్లా నాయకుడు కుంభం కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.


డీఆర్వోకు వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు

'ప్రజావాణి'ని సద్వినియోగం చేసుకోవాలి

మర్రిగూడ, జూన్ 22: ప్రభుత్వం ప్రజల సమస్యలను పరిష్కరించడం కోసం నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఏడీఏ ఎల్లయ్య తెలిపారు. ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించే ప్రజావాణిలో ప్రజలు తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్యలు పరిష్కరించుకోవాలని కోరారు.

పాలెంలో బొడ్రాయి పండుగ వేడుకలు

నకిరేకల్, జూన్ 22: నకిరేకల్ మండలంలోని పాలెం గ్రామంలో రెండోసారి శనివారం బొడ్రాయి పండుగ వేడుకలను గ్రామస్థులు ఘనంగా నిర్వహించారు. బొడ్రాయి వద్ద మహిళలు ఉదయం నుంచే ప్రత్యేక పూజలు నిర్వహించి జలాభిషేకం నిర్వహించారు. ఎమ్మెల్యే వేముల వీరేశం, సాగర్ మాజీ ఎమ్మెల్యే నోముల భగత్, ఎంపీపీ బచ్చుపల్లి శ్రీదేవి గంగాధర్‌రావుతో పాటు పలువురు బొడ్రాయి వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ షేక్ యాస్మిన్ నయీమ్, మాజీ సర్పంచులు ఏకుల కవిత విజయ్‌కుమార్, అవుట రవీంద్రమ్మనర్సయ్య, బొబ్బలి యాదగిరి, మాజీ ఎంపీటీసీ నాగిళ్ల వెంకటయ్య, నోముల గోవిందరాజులు తదితరులు పాల్గొన్నారు.

దేవరకొండలో మార్కెట్ ఏర్పాటు చేయాలి

దేవరకొండ, జూన్ 22: దేవరకొండలో వెజిటేరియన్, నాన్ వెజిటేరియన్, కూరగాయల మార్కెట్ ఏర్పాటు చేయాలని బీజేపీ జిల్లా కార్యదర్శి వస్కుల సుధాకర్, పట్టణ అధ్యక్షుడు గుండాల అంజయ్య యాదవ్ డిమాండ్ చేశారు. దేవరకొండకు కూరగాయల మార్కెట్ మంజూరై నిధులు కేటాయించినా అధికారులు స్థల సేకరణలో నిర్లక్ష్యం చేస్తున్నారని అన్నారు.

కోరం లేక సర్వసభ్య సమావేశం వాయిదా


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో ఉపేందర్‌రెడ్డి

పెద్దవూర, జూన్ 22: మండల సర్వసభ్య సమావేశం శనివారం కోరం లేకపోవడంతో వాయిదా పడింది. మధ్యాహ్నం 2గంటలకు సమావేశం కాగా ఎంపీపీ చెన్ను అనురాధ నల్లగొండలో జరిగిన జడ్పీ సర్వసభ్య సమావేశానికి హాజరైనందున ఆమె సమావేశంలో పాల్గొనలేదు. ఆమె స్థానంలో స్థానిక ఎంపీటీసీ పులిమాల కృష్ణారావు అధ్యక్షత వహించారు. ఇద్దరు సభ్యులు మాత్రమే హాజరైనందున సమావేశాన్ని వాయిదా వేస్తున్నట్లు ఎంపీడీవో ఉపేందర్‌రెడ్డి తెలిపారు.

అంగన్‌వాడీ హెల్పర్లు కేంద్రాలను శుభ్రంగా ఉంచాలి


సమావేశంలో మాట్లాడుతున్న చైర్‌పర్సన్ అనుపమ

హాలియా, జూన్, 22: అంగన్‌వాడీ హెల్పర్లు అంగన్‌వాడీ కేంద్రాలను శుభ్రంగా ఉంచుకోవాలని, పిల్లలను అమ్మ వలే జాగ్రత్తగా చూసుకోవాలని మునిసిపాలిటీ చైర్‌పర్సన్ యడవల్లి అనుపమ నరేందర్‌రెడ్డి అన్నారు. ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో శనివారం నిర్వహించిన అంగన్‌వాడీ హెల్ప ర్ల సమావేశంలో ఆమె మాట్లాడారు. కేంద్రంలో పిల్లల నమోదు పెరిగే విధంగా హెల్పర్లు కృషి చేయాలని అన్నారు. ఆరోగ్య కేంద్రంలో పిల్లలకు నాణ్యమైన ఆహారం అందించాలని సూచించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు గౌని సుధారాణి, ఎల్లమ్మ, సీడీపీవో గంధం పద్మావ తి, సూపర్‌వైజర్ రమాదేవి, ఏపీఎం కళావతి, అంగన్‌వాడీ హెల్పర్లు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలి

దేవరకొండ, జూన్ 22: అంగన్‌వాడీల సమస్యలను పరిష్కరించాలని అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ జిల్లా గౌరవ అధ్యక్షుడు పల్లా దేవేందర్‌రెడ్డి అన్నారు. గత ప్రభుత్వం అంగన్‌వాడీల సమస్యలను పరిష్కరించకుండా తీవ్ర ఇబ్బందులకు గురిచేసిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం మేనిఫెస్టోలో అంగన్‌వాడీలకు రూ.18వేల వేతనం ఇస్తామన్న హామీలన్నీ అమలుచేయాలని డిమాండ్ చేశారు. రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ టీచర్లకు రూ.10లక్షలు, హెల్పర్లకు రూ.5లక్షలు ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. అంగన్‌వాడీల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 24న ఏఐటీయూసీ ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా చేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

మర్రిగూడ: అంగన్‌వాడీ సమస్యలను పరిష్కరిచాలని ఈ నెల 24వ తేదీన జిల్లాలో ఏఐటీయూసీ ఆధ్వర్యంలో చేపడుతున్న ధర్నాను జయప్రదం చేయాలని తెలంగాణ ప్రజా నాట్యమండలి ప్రధాన కార్యదర్శి పాండు రంగారావు కోరారు. కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో చేర్చిన విధంగా తక్షణమే రూ.15వేలు అందించాలని కోరారు. ఆయన వెంట శ్రీనివాస్, నర్సింహ, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల హామీలను అమలుచేయాలి : సీపీఎం

మునుగోడు, జూన్ 22: మునుగోడు అభివృద్ధి కోసం ఎన్నికల ముందు ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి ఇచ్చిన హామీలను పక్కాగా అమలు చేయాలని సీపీఎం మండల కార్యదర్శి మిర్యాల భరత్ డిమాండ్ చేశారు. శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం వెంటనే స్పందించాలని పేర్కొన్నారు. సమావేశంలో నాయకులు వరకుప్పల ముత్యాలు, సాగర్ల మల్లేష్, లింగసామి, బిక్షం, సిద్ధిక్, రాజు, లింగస్వామి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూములు ఆక్రమిస్తే చర్యలు

మర్రిగూడ, జూన్ 22: ప్రభుత్వ భూములు ఆక్రమిస్తే చర్యలు తప్పవని ఎంపీడీవో మున్నయ్య, ఎస్ఐ రంగారెడ్డి అన్నారు. శనివారం మండలంలోని అంతంపేట గ్రామం శివారులో ఉన్న రైతువేదిక వద్ద సర్వే నెంబర్ 6లో కొంతమంది వ్యక్తులు ప్రభుత్వ భూమిని కబ్జా చేసుకున్నారని ఎంపీటీసీ బంతీలాల్ సర్వసభ్య సమావేశంలో అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. స్పందించిన ఎంపీడీవో, ఎస్ఐ, రెవెన్యూ అధికారులతో కలిసి కబ్జా చేసిన స్థలం వద్దకు వెళ్లి పరిశీలించారు. పరిశీలనలో ప్రభుత్వ స్థలంలో పశువుల షెడ్ వేసి అక్రమ నిర్మాణాలు చేసినట్లు వెల్లడైంది. దీంతో కబ్జా చేసిన వ్యక్తులను ప్రభుత్వ భూమిలో ఉన్న పశువుల షెడ్‌ను తొలగించాలని లేనిచో చట్టపరమైన చర్యలు తీసుకుంటామని వారు హెచ్చరించారు. ప్రభుత్వ స్థలంలో అక్రమంగా నిర్మించిన వారికి గ్రామపంచాయతీ నుంచి నోటీసులు జారీ చేయాలని గ్రామ కార్యదర్శికి ఆదేశించారు.

ప్రభుత్వ భూమిని ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకోవాలి

మండలంలోని తిరుగుండ్లపల్లి గ్రామశివారులోని సర్వే నెంబర్ 79లో కొంతమంది వ్యక్తులు ప్రభుత్వ భూమిని కబ్జా చేశారని, వారిపై చర్యలు తీసుకోవాలని ఆ గ్రామస్థులు తహసీల్దార్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సర్వేనెంబర్‌లో కొంతమంది ఎకరాల్లో కబ్జా చేసుకోవడమే కాకుండా పట్టా చేసుకున్నారని వినతిపత్రంలో వెల్లడించారు. సమావేశంలో నాయకులు కృష్ణమాచారి, రమేష్, వెంకటరమణ, శంకర్, జంగయ్య తదితరులు పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో వృద్ధులకు వైద్యపరీక్షలు

నార్కట్‌పల్లి, జూన్ 22: లయన్స్ క్లబ్ ఆఫ్ నల్లగొండ గోల్డెన్ జూబ్లీ వేడుకలను పురస్కరించుకుని శనివారం నార్కట్‌పల్లి మండలంలోని చెర్వుగట్టులో గల శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరి వృద్ధాశ్రమంలో వృద్ధులకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించారు. నల్లగొండకు చెందిన విశ్వన్‌సాయి ఆసుపత్రి వైద్యులతో పాటు కంటి వైద్య నిపుణుడు పుల్లారావు, దంత వైద్యుడు యామ అజయ్ వైద్య పరీక్షలు చేశారు. అనంతరం ఆశ్రమ ప్రాంగణంలో మొక్కలు నాటారు. లయన్స్ క్లబ్ ఆఫ్ నల్లగొండ అధ్యక్షుడు ఎల్వీ కుమార్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమాల్లో క్లబ్ గవర్నర్ శివప్రసాద్, మాజీ గవర్నర్ నేతి రఘుపతి, ఆర్‌సీ అశోక్‌రెడ్డి, శ్రీనివాస్, వృద్ధాశ్రమ నిర్వాహకులు రంగ శేఖర్, మీలా సోమయ్య పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం...

చిట్యాల: ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని చిట్యాల మునిసిపాలిటీ 9వ వార్డు కౌన్సిలర్ బెల్లి సత్తయ్య కోరారు. వార్డులో డాక్టర్ రెడ్డీస్ ల్యాబ్స్ వారి సహకారంతో వైద్యశిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో సింగిల్‌విండో డైరెక్టర్ జగిని బిక్షంరెడ్డి, ఆగు అశోక్, తిరుపతిరెడ్డి పాల్గొన్నారు.

శాలిగౌరారం: మండల పరిధిలోని మదారం కలాన్ గ్రామానికి చెందిన మామిడి సైదులు ఇటీవల మృతి చెందాడు. అదే గ్రామంలోని జడ్పీ హైస్కూల్‌కు చెందిన పదో తరగతి విద్యార్థులు రూ.16 వేలు జమ చేసి అతని కుటుంబసభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో అనంతుల సత్యనారాయణ, సయ్యద్ రహీం, బొడ్డు సైదులు, గంగాధర్, రాములు, రాజు, యాదయ్య, లాజర్ పాల్గొన్నారు.

మునుగోడు: మునుగోడులో ఇటీవల తీవ్ర అనారోగ్యంతో మృతి చెందిన రేవెల్లి సునీత కుటుంబసభ్యులకు ఎంపీటీసీ బొడ్డు శ్రావణినాగరాజుగౌడ్ తన సొంతంగా రూ.5 వేలు ఇస్తానని ప్రకటించారు. ఆ డబ్బులను నవతరం యూత్ సభ్యులతో బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు.

చిట్యాలరూరల్: మండలంలోని ఉరుమడ్లకు చెందిన పలువురు ఆసుపత్రిలో చికిత్స పొంది విశ్రాంతి తీసుకుంటున్న దుబ్బ గోపాల్, జన్నపాల మహేష్, ఆశీర్వాదం, మర్రి యాదయ్యలను కాంగ్రెస్ నాయకులు కోనేటి యాదగిరి, గ్రామశాఖ అధ్యక్షుడు చెరుకు సైదులు, మాజీ ఎంపీటీసీ పోలగోని సైదులు, పల్లపు బుద్ధుడు పరామర్శించారు. వారికి గుత్తా వెంకట్‌రెడ్డి మెమోరియల్ ట్రస్టు ద్వారా చైర్మన్ గుత్తా అమిత్‌రెడ్డి పంపించిన రూ. 25 వేలను గోపాల్‌కు రూ. 5వేలు, మహేష్‌కు రూ. 5వేలు, ఆశీర్వాదంకు రూ. 5వేలు, యాదయ్యకు రూ. 10వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు.

మునుగోడు: మునుగోడులో ఎలాంటి అనుమతులు లేకుండా స్కూళ్లను నడుపుతూ అధిక ఫీజులు వసూలు చేస్తున్న ప్రైవేట్ స్కూళ్లపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని డీవైఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యుడు కట్ట లింగస్వామి విజ్ఞప్తి చేశారు. డీవైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో మండలకేంద్రంలోని విద్యావనరుల కేంద్రంలోని సీఆర్‌పీలకు వినతిపత్రం అందజేశారు.

మిర్యాలగూడ టౌన్: అక్రమ వసూళ్లకు పాల్పడితే చర్యలు తప్పవని ఎస్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు ఎంఏ. ఆరీఫ్ అన్నారు. విద్యార్థి నాయకులు ప్రైవేట్ విద్యాయాల యాజమాన్యాలను బెదిరించడం తగదన్నారు. ఎన్ఎస్‌యూఐ పేరుతో ఎవరైనా వచ్చి బెదిరిస్తే తమ దృష్టికి తేవాలని ప్రైవేట్ విద్యాసంస్థలను కోరారు. విద్యార్థుల సమస్యలు పరిష్కరిస్తూ సంఘాన్ని, పార్టీని బలోపేతం చేయాలని కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు.

చిట్యాలరూరల్: మండలంలోని వెలిమినేడు శివారులో జాతీయ రహదారిపై గల ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి గతంలో గ్రామ పంచాయతీ ఇచ్చిన భూమిలో 20 గుంటలు వదిలేసి ప్రహరీని నిర్మించారని ఆసుపత్రికి సంబంధించిన భూమిని పూర్తిగా సద్వినియోగంలోకి తేవాలని ఎంపీటీసీల ఫోరం జిల్లా ఉపాధ్యక్షురాలు, వెలిమినేడు-1 ఎంపీటీసీ సభ్యురాలు దేశబోయిన స్వరూపనర్సింహ సంబంధిత అధికారులను కోరారు.

కేతేపల్లి: మండలంలోని కొండకిందిగూడెం గ్రామానికి చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ అల్లి సైదులు తను విద్యాభ్యాసం చేసిన గ్రామంలోని పాఠశాలకు కంప్యూటర్, డిజిటల్ ప్రొజెక్టర్‌ను బహూకరించారు. ఎంఈవో నాగయ్యకు కంప్యూటర్, డిజిటల్ ప్రొజెక్టర్‌ను అందజేశారు. అనంతరం గ్రామ మాజీ సర్పంచ్ గోలి మంజులవేణుమాధవరెడ్డి అందజేసిన నోటు పుస్తకాలు, హ్యాండ్ రైటింగ్ పుస్తకాలు, పెన్సిళ్లు, క్రేయాన్స్ టేబుల్ బుక్స్‌ను పాఠశాలలోని విద్యార్థులకు పంపిణీ చేశారు.